అంగన్‌వాడీ కేంద్రానికి మహర్దశ

రూ.45.84 లక్షలతో 44వ వార్డు ఎంటీసీపాలెం – 2 కేంద్రం నిర్మాణం



నాడు : పిల్లలకు చదువు, వంట, స్టోర్ అన్నీ ఒక గదిలోనే నిర్వహిస్తున్న ఎంటీసీపాలెం- 2 కేంద్రం



నేడు : అంగనవాడీ కేంద్రం కోసం కొత్తగా నిర్మించిన విశాల భవనం

సీతంపేట : గతంలో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహార పంపిణీకే పరిమితమైన అంగనవాడీ కేంద్రాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో ప్రీ స్కూళ్లుగా అద్భుతంగా తీర్చిదిద్దారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సృజనాత్మకతతో కూడిన విద్యను అందించడానికి మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. జీవీఎంసీ 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెంలో గల ఎంటీసీపాలెం – 2 అంగనవాడీ కేంద్రం ఒకప్పుడు ఒకే ఒక్క ఇరుకు గదిలో కొనసాగేది. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆ కేంద్రం రూపురేఖలు మారిపోయాయి. అదే ప్రాంతంలో రూ. 45.84 లక్షల వ్యయంతో రెండు అంతస్తుల భవనాన్ని నిర్మించారు. మొదటి అంతస్తును ఎంటీసీపాలెం అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించారు. దీంతో విశాలమైన హాల్, స్టోర్ రూమ్, కిచెన్ మొత్తం మూడు గదులు వేర్వేరుగా సమకూరాయి. అలాగే టాయిలెట్లు, నిరంతర నీటి సరఫరా, విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు, ఫర్నీచర్ సమకూరాయి.

ప్లే స్కూళ్లకు దీటుగా...

చాలా మంది వేలాది రూపాయలు ఖర్చు చేసి పిల్లలను ప్లే స్కూళ్లలో చేర్పిస్తుంటారు. వాటికంటే దీటుగా అంగనవాడీ కేంద్రాలను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీర్చిదిద్దింది. పూర్వ ప్రాథమిక శిక్షణలో భాగంగా గుడ్ హేబిట్స్, ఇండోర్ గేమ్స్, స్టోరీ టెల్లింగ్, యాక్టివిటీ, సాంగ్స్, కన్వర్‌జేషన్, అవుట్ డోర్ గేమ్స్, ఫిజికల్ ఎక్సర్‌సైజ్, వర్క్‌బుక్ ఫర్ యూకేజీ, ఎల్‌కేజీ, క్రియేటివిటీ యాక్టివిటీ, తదితర అంశాలు ప్రీస్కూల్ విద్యలో భాగంగా అందజేస్తున్నారు. ఆయా అంశాల బోధనకు అవసరమైన చార్టులు, మోడల్స్, పిక్చర్లు, ఫ్లాష్‌కార్డులు ప్రతీ అంగనవాడీ కేంద్రానికి అందజేశారు. పూర్వ ప్రాథమిక విద్య ద్వారా చిన్నారుల్లో అభ్యసన స్థాయి పెంపొందించడానికి రోజువారీ ఎటువంటి కార్యక్రమాలు బోధించాలో కార్యకర్తలకు అధికారులు తర్ఫీదు ఇచ్చారు. చిన్నారులను ప్రతిభ ఆధారంగా విభజించి వెనుకబడిన వారు చదువుపై ఏకాగ్రత, గ్రహణ శక్తి, మానసిక వికాసం పెంపొందించడానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.



అంగన్‌వాడీ కేంద్రం నూతన భవనంలో స్టోర్ రూమ్



కేంద్రంలో కొత్తగా నిర్మించిన వంట గది

సౌకర్యాలు సమకూరాయి



ఒకప్పుడు మా అంగనవాడీ కేంద్రం ఒకే ఒక్క ఇరుకు గదిలో ఉండేది. పిల్లల చదువు, వంట చేయడం, సామగ్రి భద్రపరచడం అన్నీ ఒకేచోట చేసేవారిమి. దీంతో చాలా ఇబ్బంది పడేవారం. పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు ఇష్టపడేవారు కాదు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మా అంగనవాడీ కేంద్రం రూపురేఖలు మారిపోయాయి. తల్లిదండ్రులు చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– పి.లక్ష్మి, అంగనవాడీ టీచర్, ఎంటీసీపాలెం

ప్లే స్కూల్‌ను మరిపించేలా..



మా బాబు పేరు కుషాల్. మూడు సంవత్సరాల వయస్సు. గత ఫిబ్రవరి నెల నుంచి అంగనవాడీ కేంద్రానికి వెళ్తున్నాడు. రోజూ మెనూ ప్రకారం పోషకాహారం అందిస్తున్నారు. పిల్లల్లో చదువు పట్ల ఆసక్తి, గ్రహణ శక్తి పెంపొందేలా కథలు, పాటలు, ఆటలు, చార్టులు, ఫ్లాష్ కార్డుల ద్వారా బోధిస్తున్నారు.

– సీరపు రమ, విద్యార్థి తల్లి, ఎంటీసీపాలెం

నాణ్యమైన సరకుల పంపిణీ



ప్రతీ నెలా వైఎస్సార్ పోషణ కిట్స్ అందజేస్తున్నారు. రాగిపిండి, బియ్యం, పప్పు, నూనె, బెల్లం, అటుకులు, ఖర్జూరం మంచి నాణ్యతతో ఇస్తున్నారు. అంగనవాడీల సేవలు చాలా బాగున్నాయి. ఎటువంటి ఆహారం తీసుకోవాలో అవగాహన కల్పిస్తున్నారు.

– సీహెచ్.మౌనిక, గర్భిణి, అక్కయ్యపాలెం

అభివృద్ధి పథంలో ఉత్తర నియోజకవర్గం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కేకే రాజు
- రూ. 52.75 లక్షలతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కె.కె.రాజు

సీతంపేట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో ఉత్తర నియోజకవర్గం అభివృద్ధిపథంలో నడుస్తోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. 26వ వార్డు శంకువానిపాలెం, లలితానగర్, రామకృష్ణానగర్, ఎన్జీజీవోస్ కాలనీ ప్రాంతాల్లో రూ. 52.75 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య, ఉపాధి, ఆరోగ్యంపై దృష్టి సారించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట చేస్తున్నారన్నారు. అలాగే ప్రజా ప్రతినిధులు నిత్యం ప్రజల మధ్య ఉండేలా అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి, కార్పొరేటర్ శ్రావణి, 14వ వార్డు కార్పొరేటర్ అనిల్‌రాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, బొడ్డేటి కిరణ్, రేవతిరావు, పాండవ శ్రీను, సునీల్, శేషు, విజయపాల్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో మన్ననలు



మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలిగా ప్రమాణం చేస్తున్న సత్తి లలితారెడ్డి

మురళీనగర్: మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు సేవా కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందాలని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు వి.మురళీమోహన్ సూచించారు. వాకర్స్ క్లబ్ ప్రాంగణంలో మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ – 2024 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. క్లబ్ నూతన అధ్యక్షురాలు సత్తి లలితా రెడ్డి పదవీ స్వీకార ప్రమాణం చేశారు. ఆమెకు ప్రస్తుత అధ్యక్షురాలు ఎం.శేషామణి బాధ్యతలు అప్పగించారు. సత్తి లలితా రెడ్డి నూతన కమిటీ సభ్యులను సభకు పరిచయం చేశారు. అనంతరం ఓం వాకర్స్ క్లబ్ (బిర్లా జంక్షన్), అగనంపూడి వనితా వాకర్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులు పదవీ ప్రమాణం చేశారు. ఓం వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలిగా వి.ప్రమీల, అగనంపూడి వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలిగా ఇ.ఇందిరాదేవి తమ కార్యవర్గ సభ్యులతో కలిసి ప్రమాణం చేశారు. కార్యక్రమంలో జిల్లా 101 గవర్నర్ టి.రంగారావు, వాకర్స్ ఇంటర్నేషనల్ అడిషనల్ సెక్రటరీ జనరల్ ఆర్.సత్యనాథం, ఎలక్టెడ్ గవర్నర్ కె.ద్వారకానాథ్, ఇంటర్నేషనల్ సెక్రటరీ వి.ప్రదీప్, జిల్లా 101 కార్యదర్శి బి.సత్యనారాయణ, ఇమ్మీడియట్ పాస్ట్ గవర్నర్ యు.శుభ, ఇమ్మీడియట్ పాస్ట్ ఆర్‌సీ – 5 ఎ.లక్ష్మీ రెడ్డి, జిల్లా 101 కోశాధికారి మురళి పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు



జ్ఞానాపురం రైల్వే స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన స్పీడ్‌బ్రేకర్

మర్రిపాలెం: వాహనాల వేగానికి కళ్లెం వేసేందుకు, ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులు కాన్వెంట్ జంక్షన్ నుంచి కంచరపాలెం బ్రిడ్జి వరకు ఐదు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసినట్టు సీఐ మళ్ల అప్పారావు మంగళవారం చెప్పారు. వాహనాల వేగం నియంత్రించేందుకు, ప్రమాదాలు అరికట్టేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆ ప్రాంతంలో స్కూళ్లు, కాలేజీలు, ఆలయాలు, చర్చిలు వున్నందున, నిత్యం రద్దీగా వుండడంతో ఈ ఏర్పాట్లు చేశామని తెలిపారు. వాహనదారులు వాహనాలు జాగ్రత్తగా నడిపి, సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలని సూచించారు.

కౢప్తంగా

కాల భైరవ హోమం నేడు

సీతంపేట: బహుళ అష్టమి సందర్భంగా బుధవారం సాయంత్రం 6:30 గంటలకు శ్రీ లలితాపీఠంలో కాలభైరవ హోమం జరిపిస్తున్నట్లు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ తెలిపారు. గురువారం ఉదయం 9:30 గంటలకు చండీ హోమం జరుగుతుందన్నారు. మాసశివరాత్రి సందర్భంగా 10వ తేదీ సాయంత్రం కాశీ కాల భైరవులకు అమృత అఘోర మృత్యుంజయ పాశుపత అభిషేకం, అమావాస్య సందర్భంగా 11వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీ ప్రత్యంగిరా భద్రకాళి హోమం జరుగుతుందని తెలిపారు. పాల్గొనదలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కౌశల్ పోస్టర్ పోటీల్లో మెరిసిన సంపత్



జ్ఞాపిక, సర్టిఫికెట్లతో సాయిసంపత్

సీతంపేట: గత నెల విజయవాడలో జరిగిన కౌశల్ పోస్టర్-2023 పోటీ స్పెషల్ థీమ్‌లో జీవీఎంసీ మధురానగర్ హైస్కూల్ విద్యార్థి ఎం.సాయిసంపత్ రాష్ట్ర స్థాయిలో 4వ స్థానంలో నిలిచాడు. డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు చేసిన వైజ్ఞానిక కృషికి సంబంధించి సాయిసంపత్ ప్రదర్శించిన పోస్టర్‌కు బహుమతి వరించింది. ఈ సందర్భంగా సాయి సంపత్‌ను స్కూల్ హెచ్‌ఎం డి.శాంతికుమారి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నేడు

సీతంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్) రెండో విడత వైద్య శిబిరాలు ఉత్తర నియోజకవర్గంలో బుధవారం నుంచి ప్రారంభం అవుతున్నాయి. దీనిలో భాగంగా జోన్ 3 పరిధిలో బుధవారం 26వ వార్డు అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి వద్ద గల కూరగాయల బజారు మేడ పైన శంకువానిపాలెం సచివాలయానికి సంబంధించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరుగుతుందని విద్యుత్‌నగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధీర్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని, వివిధరకాల పరీక్షలు, స్పెషలిస్టు వైద్యుల సేవలు ఉచితంగా పొందవచ్చని తెలియజేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జోన్-5లో రైల్వేన్యూ కాలనీ యూపీహెచ్‌సీ పరిధి వెంకటరాజునగర్ సచివాలయ పరిధిలో.., ఏకేసీ కాలనీ యూపీహెచ్‌సీ పరిధి ఏకేసీ కాలనీ-01 సచివాలయం పరిధిలో, అంబేద్కర్ నగర్ యూపీహెచ్‌సీ పరిధి మాధవధార -01 సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాలు జరగనున్నాయి.

గ్రీవెన్స్‌కు విశేష స్పందన

సీతమ్మధార : వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు మంగళవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు విశేష స్పందన లభించింది. 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కేకే రాజుకు ప్రజలు పలు సమస్యలపై వినతులు అందించారు. కొన్ని వినతులను తక్షణం పరిష్కరించిన ఆయన, మరికొన్నింటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేశారు. త్వరలోనే పరిష్కరిస్తామని అర్జీదారులకు తెలియజేశారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు ధర్మానగర్‌లో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ సీనియర్ నాయకుడు సొండి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ హాజరై, వేడుకలు ప్రారంభించారు. ఇటీవల నిర్వహించిన పలు సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ముందుగా కేక్ కట్ చేసి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. నియోజకవర్గ ఎస్సీసెల్, బీసీ సెల్ అధ్యక్షులు సిద్ధార్థ రాజు, గంగా మహేష్, వార్డు అధ్యక్షుడు కాయిత పైడి రత్నాకర్ యాదవ్ పాల్గొన్నారు.

'పారిశుధ్య కార్మికులు విధుల్లో చేరాలి'



కార్మికులతో చర్చిస్తున్న అల్లు శంకరరావు

మురళీనగర్: పారిశుధ్య కార్మికులు సమ్మెను విరమించి, విధుల్లోకి రావాలని జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు కోరారు. వార్డులోని కార్మికులను ఆయన మంగళవారం కలిసి వారితో చర్చించారు. నగరంలో వ్యర్థాలు పేరుకుపోతున్న నేపథ్యంలో కార్మికులు వెంటనే విధుల్లో చేరాలని కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పారిశుధ్య కార్మికులకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, వారికి మేలు చేస్తున్నారని గుర్తు చేశారు. వారు విధుల్లోకి రావడానికి నిరాకరించడంతో పట్టాభిరెడ్డి తోట, ఎన్‌జీజీవోస్ కాలనీల్లో పేరుకుపోయిన చెత్త తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. చెత్త తొలగింపులో ఆయన స్వయంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భట్రాజ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.రవి కుమార్, సీనియర్ కార్యకర్తలు బి.శంకర్, సీహెచ్ శ్రీను, ఎం.శంకర్ పాల్గొన్నారు.


సభ్యుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు ఎ.ఎం.ఫ్రెడ్డీ

సీతంపేట: విశాఖ పోర్టు ట్రస్టు మెటీరియల్ మేనేజ్‌మెంట్ విభాగం విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం వార్షిక సమావేశం మంగళవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. సమావేశంలో సంఘం అధ్యక్షుడు ఎ.ఎం.ఫ్రెడ్డీ మాట్లాడుతూ సంఘంలో 110 మంది వరకు సభ్యులు సభ్యత్వం కలిగి ఉన్నారని, కొత్తగా మరికొంత మంది చేరారన్నారు. సభ్యుల సంక్షేమం కోసం ఒకరికొకరు సాయం చేసుకోవాలన్నారు. 2023–24 సంవత్సరంలో సంఘం చేపట్టిన సభ్యుల సంక్షేమ కార్యక్రమాలు, గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌లో సభ్యుల సేవల కోసం ఏర్పాట్లు, కొత్త సభ్యుల చేరికలు వివరించారు. 2024 సంవత్సరంలో చేపట్టనున్న కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎం.ఎ స్.ఆర్.గుప్తా, కోశాధికారి డి.వెంకటేశ్వరరావు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్ర ఏర్పాట్ల పరిశీలన



సభా ప్రాంగణం వద్ద పార్టీ నాయకులకు సూచనలు చేస్తున్న కేకే రాజు

తాటిచెట్లపాలెం: ఈ నెల 6వ తేదీన జరగనున్న సామాజిక సాధికార బస్సుయాత్ర కోసం కైలాసపురం పోర్ట్ హాస్పిటల్ దగ్గర గల ఇనార్బిట్ మాల్ రోడ్‌లో సభా ప్రాంగణం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు మంగళవారం పరిశీలించారు. నాయకులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్ రాజు, ఆళ్ల లీలావతి శ్రీనివాస్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్ రాజు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్షింతలతో పులకించిన భక్తజనం

మధురవాడ: అయోధ్య శ్రీరామ క్షేత్ర ట్రస్ట్ నుంచి మధురవాడలోని ఆలయాలకు అక్షింతలు చేరాయి. వీటిని ఆయా ఆలయాల కమిటీ సభ్యులు పంపిణీ చేస్తున్నారు. వీటిని తీసుకున్న భక్తులు భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. మంగళవారం ఐటీ సెజ్ జంక్షన్ వద్ద మానం ఆంజనేయులు నగర్‌లో గల శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత మహాకామేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో భద్రాది రాముని సన్నిధి నుంచి సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వామి విగ్రహాలు, అక్షింతలు పల్లకీలో కోలాటంతో ఊరేగించారు. ఆర్‌టీసీ కాలనీ, మల్లయ్యకాలనీ, కళానగర్, నగరంపాలెం, వాంబేకాలనీలో సుమారు 3500 గడపలకు అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు బొడ్డేపల్లి సురేష్, పసుపులేటి శ్రీనివాసరావు, వీహెచ్‌పీ సెక్రటరీ శ్రీపాద వెంకటరమణ, ఎస్ఎస్ నారాయణ, పైడిరాజు, తిరుపతి రాజు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 20వ రోజు మంగళవారం అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

అష్టదళ పద్మారాధన..

108 స్వర్ణపుష్పాలతో కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన జరిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 2 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాదస్వర కచేరీ..

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నాదస్వర కచేరీ నిర్వహించారు. కళాకారులు పలు కీర్తనలు ఆలపించారు.

6న రథయాత్ర

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసంలో ప్రతి ఏటా నిర్వహించే కనకమహాలక్ష్మి అమ్మవారి రథోత్సవ కార్యక్రమం ఈ నెల 6న అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు నగరంలోని జగదాంబ జంక్షన్ సమీపాన మహారాణిపేటలో గల అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి జగదాంబ జంక్షన్, టర్నర్ చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, ఏవీఎన్ కాలేజీ డౌన్‌రోడ్డు, టౌన్‌కొత్తరోడ్డు, రీడింగ్ రూమ్ మీదుగా ఆలయం వరకు రథోత్సవం సాగనుంది.

నీలమ్మ వేపచెట్టు అమ్మవారి హుండీ ఆదాయం రూ.1.22 లక్షలు



హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో రమాబాయ్, చైర్‌పర్సన్ విజయలక్ష్మి

అల్లిపురం : అస్సాం గార్డెన్స్‌లో వెలసిన నీలమ్మ వేపచెట్టు అమ్మవారికి హుండీ ద్వారా రూ.1,22,497 ఆదాయం లభించిందని ఆలయ ఈవో జీవీ రమాబాయ్ తెలిపారు. ఈ మొత్తం రెండు నెలలకు గాను లభించినట్లు చెప్పారు. మంగళవారం ఆలయ ఆవరణలో ఇన్స్‌పెక్టర్ రాజు ఆధ్వర్యంలో జరిగిన లెక్కింపులో ఆలయ చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి, ధర్మకర్తలు లక్ష్మీకాంతం, చంద్రకళ, శ్రీహరి సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



వాసవి క్లబ్ సభ్యులను అభినందిస్తున్న కేకే రాజు

సీతమ్మధార: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సీతమ్మధార క్లస్టర్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం మంగళవారం ఘనంగా జరిగింది. సీతమ్మధారలోని కల్యాణమండపంలో నిర్వహించిన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్లబ్ ప్రెసిడెంట్ మానేపల్లి సుగుణకుమార్, సెక్రటరీ లక్ష్మి, కోశాధికారి జయకృష్ణతో పాటు నూతన కార్యవర్గానికి ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మొల్లి అప్పారావు, కంకటాల సిల్క్స్ యాజమాని కంకటాల ప్రభాకర్, సూర్య పికిల్ రమేష్, సింహాచలం దేవస్థానం ట్రస్టీ సాయి నిర్మల, వాసవి క్లబ్ గవర్నర్ వివి గుప్తా, ఆంధ్రా యూనివర్సిటీ డిప్యూటీ రిజిస్ట్రార్ సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న కేకే రాజు

సీతమ్మధార : నియోజకవర్గంలో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు అధికారులను కోరారు. బాలయ్యశాస్త్రి లే అవుట్‌లోని కార్యాలయంలో జీవీఎంసీ జోన్-3, 5 పబ్లిక్ వర్క్స్, వాటర్ వర్క్స్ అధికారులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు.

నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు, డ్రైన్లు, కాలువల పనులపై చర్చించారు. పనులు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, ఎస్ఈలు, ఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహనతోనే రక్షణ

ఏయూ క్యాంపస్: రాజ్యాంగం కల్పించిన హక్కులపై పూర్తిస్థాయిలో అవగాహన ఉన్నప్పుడే మహిళలకు రక్షణ సాధ్యపడుతుందని ఏయూ ఆర్ట్స్, కామర్స్ ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు అన్నారు. మంగళవారం మహారాణిపేట మహిళా అతిథి గృహంలో డాక్టర్ దుర్గాబాయ్ దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం, వుమెన్ గ్రీవెన్స్ సెల్, ఐసీసీ అంతర్గత ఫిర్యాదు కేంద్రం సంయుక్తంగా మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సును ఆయన ప్రారంభించారు. ముందుగా దుర్గాబాయి దేశముఖ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మహిళలకు విద్య ఎంతో అవసరమని, తద్వారా మహిళా సాధికారత సాధ్యపడుతుందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ముందుండి పోరాటాన్ని నడిపించిన దుర్గాబాయి దేశముఖ్ జీవితం నుంచి స్ఫూర్తిని పొందాలన్నారు.

మహిళా అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య ఎ.పల్లవి మాట్లాడుతూ 1987లో ప్రారంభించిన ఈ కేంద్రం మహిళల ప్రగతికి ఎంతగానో కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకుంటూ ప్రతిభతో రాణించాలన్నారు. దిశ మహిళా పోలీస్ స్టేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు మాధవి గణపతి మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌కు ఎక్కువ సమయం వెచ్చించకుండా చదువుపై దృష్టిసారించాలన్నారు. ఏయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి మాట్లాడుతూ దిశ చట్టం వల్ల మహిళలకు ఉపయోగాలు, సమస్యలు వచ్చిన సందర్భంలో స్పందించే విధానం వివరించారు. ఈ కార్యక్రమంలో సైన్స్, ఆర్ట్స్ కళాశాలలకు చెందిన పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.